క్లుప్తంగా

రోడ్డుపై అడ్డంగా ఇలా.. వాహనాలు నడిచేదేలా


రోడ్డుపైనే అడ్డంగా నిలిపిన వాహనాలు

గడివేముల: గడివేముల-నంద్యాల రహదారిలోని గ్రంధివేముల గ్రామం వద్ద రహదారి పైనే వాహనాలు నిలిపివేయడం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రహదారి పక్కనే పంచర్ దుకాణాలు ఉండడంతో భారీ వాహనాలు పంచర్ల కోసం రోడ్డుపైనే నిలుస్తున్నాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఇక సమీపంలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో తిరుగుతుంటాయి. రాత్రివేళల్లో నిలిపిన వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయని వాహనదారులు తెలిపారు. ప్రయాణ సౌకర్యానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని స్థానికులు కోరుతున్నారు.

ముళ్లపొదలను తొలగించండి


రోడ్డుపై వచ్చిన కంపచెట్లు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామ ప్రధాన రోడ్డుపై ముళ్లచెట్లు పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. ఈ రోడ్డుపై నిత్యం ఆటోలు, వ్యవసాయ కూలీలు తిరుగుతుంటారు. సమీపంలో పాఠశాల ఉండడంతో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలను తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పంట కాలువ లీకేజీ


సి.బెళగల్లోని ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న కాలువ లీకేజీ నీరు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో పంట కాలువ (పెద్ద కాలువ) లీకేజీ కావడంతో నీరంతా గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. వరిమడుల సాగులో భాగంగా రైతులు చెరువు నీటిని పెద్ద కాలువ ద్వారా పొలాలకు విడుదల చేసుకున్నారు. అయితే కాలువ శిథిలమవ్వడంతో పాటు పూడిక పేరుకోపోవడంతో నీళ్లు లీకేజీ అయి బయటకు వస్తున్నాయి. ప్రధాన రోడ్డుతో పాటు గృహాల వద్దకు చేరుతుండటంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గత ఐదు రోజులుగా ఈ సమస్య నెలకొంది. అధికారులు మాత్రం ఇప్పటి వరకు పరిష్కారం చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

అక్రమ ఏజెంట్ల లైసెన్స్ రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లిని కొనుగోలు చేయకుండా వెళ్లిపోయిన వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్లను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉల్లిని కొనుగోలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమవడంతో అన్నదాతలకు ఆత్మహత్యలు తప్పా మరోదారి లేదన్నారు. నాణ్యత పేరుతో ఉల్లి రైతుకు అన్యాయం చేస్తున్నారని, కనీసం ధరను కూడా ఇవ్వడం లేదన్నారు. ప్యాకెట్ రూ.100లకు అడగడం అన్యాయమన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్వింటాల్ ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేస్తామని చెప్పినా ఎప్పటినుంచి కొనుగోలు చేస్తారో చెప్పకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనతో ఉన్నారన్నారు. క్వింటాల్ ఉల్లిని రూ.3 వేలకు కొనుగోలు చేస్తేనే అన్నదాతలకు మద్దతు ధర లభిస్తుందని చెప్పారు.

వీఆర్పీఎస్ నగర అధ్యక్షుడి నియామకం

కర్నూలు(అర్బన్): వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడిగా కే.వెంకటనాయుడు నియమితులయ్యారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వీఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడిగా వెంకటనాయుడును ప్రకటించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందేలా కేంద్రాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వేలాది మంది వాల్మీకులతో అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. నగర అధ్యక్షుడిగా నియమితులైన వెంకటనాయుడు మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం వీఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 7న నగర నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ సంఘాల నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య, ధనుంజయ ఆచారి, మైనారిటీ సంఘం రాష్ట్ర నాయకులు యూనస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాలయ్యా..వెళ్లి రావయ్యా

- కనుల పండువగా గణేష్ నిమజ్జనోత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కోడుమూరు రూరల్: గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. వినాయక చవితిని పురస్కరించుకొని వాడవాడలో కొలువైన వినాయకులు ఐదురోజులు పూజలందుకున్నారు. చివరిరోజు ఆదివారం భారీ ఊరేగింపు మధ్య నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. చిన్నారులు, మహిళలు, పెద్దలు ఒకరిపై ఒకరు వసంతం చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో గణనాథుల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. ప్యాలకుర్తి గ్రామం మెయిన్బజార్లో వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూను వేలం పాటలో అదే గ్రామానికి చెందిన పద్మశాలి పరమేష్ అత్యధికంగా రూ.22,300కు వేలం పాట పాడి దక్కించుకున్నాడు. నిమజ్జనం సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోడుమూరు పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

- వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గూడూరులో కొలువుదీరిన గణనాథులను ఆదివారం సాయంత్రం సుంకేసుల వద్ద ఉన్న కేసీ కెనాల్లో నిమజ్జనం చేశారు. వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జింకల కుమార్, స్థానిక నాయకులు వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు తబ్రేజ్, నాగరాజు, ఎస్ఐలు చర్యలు చేపట్టారు.
- జులకల్లు గ్రామంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఊరేగింపులో యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. మాస్టర్ వీరేష్ ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శించిన కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


గూడూరులో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు


పాణ్యం చెరువులో వినాయకుడి నిమజ్జన దృశ్యం

సి.బెళగల్: సి.బెళగల్: మండలంలోని కొత్తకోట, పోలకల్ గ్రామాల్లో గణనాథుల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు వినాయకుడి నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. పోలకల్ గ్రామంలో శ్రీ చెన్న సోమేశ్వర ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహా వినాయకుడి నిమజ్జనం చేశారు.

కర్నూలు(రూరల్): వాడవాడలా కొలువైన గణనాథులు ఆదివారం గంగమ్మ ఒడికి చేరారు. కర్నూలు మండల పరిధిలో దాదాపుగా 160 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు అర్బన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వెళ్లిరా వినాయక

ఓర్వకల్లు: వినాయక చవితి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఐదు రోజులపాటు భక్తుల పూజలందుకున్న గణనాథులు రాత్రి గంగమ్మ ఒడికి చేరుకున్నారు. 'ఉండ్రాలయ్యాం ఉంటామయ్యా' అంటూ భక్తులు జైకొట్టి వీడ్కోలు పలికారు. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, కాల్వ, బ్రాహ్మణపల్లె, పూడిచెర్ల, కేతవరం, చింతలపల్లె, మీదివేముల గ్రామాల్లో కొలువుదీరిన గణపయ్యలను ఆయా గ్రామ సమీపంలోని చెరువులు, వాగులు, కుంటలలో నిమజ్జనం చేశారు. యువకులు డప్పులు, బాణసంచా పేళ్లతో సందడి చేశారు. ట్రాక్టర్లపై విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా తరలించారు. ''గణపతి బప్పా మోరియా..జై బోలో గణేష్ మహారాజ్ కి జై'' అంటూ నినాదాలు మారుమోగాయి. ఎస్ఐ సునీల్కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నిమజ్జన వేడుకల సందర్భంగా లడ్డూ ప్రసాదాలను వేలం వేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గణనాథుడి లడ్డూను చలపతిరెడ్డి రూ.28,500లకు దక్కించుకున్నారు. ఆంజనేయస్వామి వద్ద విగ్రహం లడ్డూను వడ్డే సురేష్ అత్యధికంగా రూ.51 వేలకు సొంతం చేసుకున్నారు. అలాగే వైఎస్సార్ విగ్రహం వద్ద తిరుమలేష్ రూ.25,500లకు, తోటగేరి వద్ద మహబూబ్బాషా రూ.25,500లకు, చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద ఓ భక్తుడు రూ.1200లకు లడ్డూ దక్కించుకున్నట్లు తెలిసింది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన గణనాథుల శోభాయాత్ర రాత్రి 10.30 గంటలకు ముగిసింది.

విద్యుత్ అంతరాయంపై అసహనం

ఉత్సవాల మధ్యలో నాలుగు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలిగింది. దీంతో భక్తులు చీకట్లోనే గణనాథులను దర్శించుకోవాల్సి వచ్చింది. ఈ విషయంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఉత్సవాలు జరుగుతున్న సమయంలో విద్యుత్ కోత విధించడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు.

నిమజ్జన వేడుకలు

పాణ్యం: మండల కేంద్రంలోని ఊరిముందర చెరువులో ఆదివారం గణనాథులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఐదు రోజుల పాటు పూజలందుకున్న లంబోదరుడు చివరి రోజు భారీ ఊరేగింపు నడుమ నిమజ్జనానికి తరలివెళ్లాడు. దారి పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాణ్యంలో చవితి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.


ప్యాలకుర్తిలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు


గార్గేయపురం తేరు బజారు వీధి నుంచి గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


పోలకల్లో మహా వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు


జులకల్లులో వినాయక విగ్రహం ఊరేగింపులో బాలికల కోలాటం


ఓర్వకల్లు: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


తోటగేరి వద్ద పోటాపోటీగా లడ్డూ వేలం పాట

ఆదమరిస్తే అంతే!


దెబ్బతిన్న కల్వర్టు

కర్నూలు నగరం కృష్ణానగర్ ఐటీసీ కూడలి సమీపంలోని శరీన్నగర్, రాఘవేంద్రనగర్ తదితర కాలనీల నుంచి సర్వీస్ రోడ్డు కాల్వర్టు వద్ద గుంత ఏర్పడి రోడ్డు దెబ్బతినింది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డుపై ఎక్కువగా కార్మికులు ద్విచక్రవాహనాలు, ఆటోల ద్వారా ప్రయాణిస్తుంటారు. రోడ్డు మలుపు దగ్గర కాల్వర్టుపై గుంత ఉండడంతో వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా గుంతలో పడాల్సిందే. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న కాల్వర్టుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. -కల్లూరు

పాత విధానంలోనే పరీక్షలు నిర్వహించాలి

కోడుమూరు రూరల్: బుక్లెట్ అసెస్మెంట్ విధానం వల్ల బోధనలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగుతున్నందున పాత విధానంలోనే పరీక్షలు నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కోడుమూరులోని ఎస్ఎల్ఎన్ఎస్ కన్వెన్షన్ హాల్లో ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి పూర్తిగా మినహాయించాలని, ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్పాటి, నాయకులు హేమంత్కుమార్, దావీదు, జీవిత, తిమ్మన్న, శ్రీనివాసులు, బాబు, ఇబ్రహీం, కౌలన్న, గాదిలింగ, నీలకంఠ, వెంకటేష్, భాస్కర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్కుమార్

ఇన్పుట్ డీలర్లు నైపుణ్యం పెంచుకోవాలి


మాట్లాడుతున్న ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ సిరిగిరెడ్డి జయరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లు రైతులు, అధికారులతో సత్సంబంధాలు నిర్వహించాలని ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ సిరిగిరెడ్డి జయరెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్లో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్పుట్ డీలర్లకు నైపుణ్యం పెంపుపై అవగాహన కల్పించారు. డీలర్లు లాభార్జనే ధ్యేయంగా కాకుండా విలువలతో కూడిన వ్యాపారం చేయాలన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే రైతులకు మంచి జరుగుతుందని సూచించారు. డీలర్లు సహనాన్ని పెంచుకునేందుకు సూచనలు ఇచ్చారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ.. పురుగు మందుల అమ్మకాల్లో.. ఎకరాకు వాడాల్సిన మోతాదు.. లీటరు నీటికి ఎంత మందు కలుపుకోవాలో స్పష్టంగా తెలియజెప్పాలన్నారు. ఎకరాకు కనీసం 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేసే విధంగా చూడాలన్నారు. పురుగు మందులు, తెగుళ్ల మందులు కలిపి పిచికారీ చేయరాదని సూచించారు.

సాహిత్యచరిత్రను మలుపు తిప్పిన ఆరుద్ర

కల్లూరు: తెలుగు సాహిత్య చరిత్రను ఆరుద్ర మలుపు తిప్పారని సాహితీవేత్త తెలకపల్లి రవి అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నగరంలోని యూటీఎఫ్ భవనంలో జరిగిన ఆరుద్ర శతజయంతి ముగింపు సభలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. ముందుగా ఆరుద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ''ఏది రాస్తే అదే చరిత్ర.. ఏం చెబితే అదే ప్రసంగం అనే కాలంలో ఆరుద్ర వాస్తవసాహిత్య చరిత్రను అందించి తెలుగు సాహిత్యంలో కొత్త పుంతలు తొక్కించారు. సమగ్రాంధ్ర సాహిత్యం పదమూడు సంపుటాలు పరిశోధకులకు పవిత్రగ్రంథాలుగా నిలిచాయి'' అని తెలిపారు. కవిగా, చరిత్రకారుడిగా, నాటకకర్తగా, గేయరచయితగా ఆరుద్ర చేసిన కృషి అపారమన్నారు. దాదాపు వేల పాటలు రాసి సినీ సాహిత్యంలో అజరామరంగా నిలిచిపోయారని గుర్తుచేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ.. ఆరుద్ర రచనలు నేటికీ ఆదరణ పొందుతున్నాయని, వర్తమాన సాహిత్యంలోనూ ఆయన ధ్రువతారగా నిలుస్తున్నారని చెప్పారు. సభను రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె. సురేష్కుమార్, నాయకులు యూఆర్.ఏ. రవికుమార్, మధు బాలగొని, సూర్యప్రకాశ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆరుద్ర శతజయంతి సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

గడివేముల: పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అధికారులందరూ తప్పక హాజరుకావాలని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి కొందరు మండల స్థాయి అధికారులు హాజరుకావడం లేదన్నారు. హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

సి.బెళగల్:స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కర్నూలు శాఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని విశ్రాంత జాయింట్ కలెక్టర్ రామస్వామి అన్నారు. విశ్రాంత ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు మురారి శంకరప్ప పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక బి.క్యాంపులోని మన వృద్ధుల ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమానికి నిత్యావసర సరకులు, బియ్యం, నూనె అందచేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ మెల్విన్ రాయపాటి శ్రీనివాస్, విశ్రాంత తహశీల్దారు జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి నాణ్యతగా ఉంటేనే మద్దతు ధర

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సెప్టెంబరు 1 నుంచి మార్క్ఫెడ్ ఉల్లి క్వింటాలుకు రూ.1200 మద్ద తు ధరతో కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మార్కె ట్కు వచ్చిన ఉల్లిగడ్డలను ఎఫ్ఏక్యూ నాణ్యతతో కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినందున సరుకును గ్రేడింగ్ చేసుకొని ఎలాంటి మురుగులు లేకుండా తగిన నాణ్యతతో తీసుకరావాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్కు ఉల్లిగడ్డలు తెచ్చే రైతులు పొలం పాసు పుస్తకం, ఈ-క్రాప్ బుకింగ్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాసు పుస్తకం నకళ్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఇస్కాన్లో రాధాష్టమి

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో శ్రీరాధాష్టమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్లోని పూరి జగన్నాథ మందిరంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ హారతి, దర్శ న హారతి, హరినామ సంకీర్తన, దేవతా మూర్తులకు అభిషేకం, మహారాజ భోగ నివేదన, ప్రత్యేక ప్రవచనం, రాజ భోగ హారతి, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు కన్నులపండువలా జరిగాయి. ఇస్కాన్ ప్రవచకులు రఘునందన సేవక ప్రభు భక్తులకు సందేశమిచ్చారు.


దేవతా మూర్తులకు రాజభోగ నివేదన

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

కర్నూలు కల్చరల్: అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని దేశ వ్యాప్తంగా పునరుద్ధించే వరకు పోరాటం చేయాలని తీర్మానం చేసినట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఏజీఎస్ గణపతిరావు, ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్రావు పేర్కొన్నారు. పుదుచ్చేరిలో ఈనెల 30, 31 తేదీల్లో జరిగిన జాతీయ సమావేశంలో ఏఐపీటీఎఫ్ జాతీయ అధ్యక్షులు బసవరాజ్ గురికర్, జాతీయ సెక్రటరీ జనరల్ కమల్కాంత్ త్రిపాఠి, పాండిచ్చేరి విద్యా శాఖ మంత్రి నమశ్శివాయం పాల్గొన్నారని వారు వెల్లడించారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే!

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు పదే పదే పోలవరం - బానకచర్ల అనుసంధానంతో రాయలసీమలో కరువు పోతుందని చెప్పడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబా బు చెప్పేవన్నీ అబద్ధాలేనని దుయ్యబట్టారు. బానకచర్లతో రాయలసీమలోని కరువు పోదని, స్థానికంగా ఉన్న ప్రాజెక్టులను నిర్మిస్తే అన్నదాతకు సాగునీరు, ప్రజలకు తాగునీరు లభిస్తుందన్నారు. చంద్రబాబు చెప్పే బానకచర్ల ప్రాజెక్టు కేవలం కాంట్రాక్టర్ల కోసమేనని, దీనిపై ప్రజల్లో చైతన్యం చేస్తామన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు


మాట్లాడుతున్న ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

కర్నూలు(హాస్పిటల్): ఒకరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు కంటి చూపు తిరిగి వస్తుందని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ చెప్పారు. మరణించాక మట్టిలో కలిసే కార్నియాలను ఇతరులకు దానం చేస్తే అంధత్వాన్ని దూరం చేయవచ్చన్నారు. త్వరలో తమ సిబ్బందితో నేత్రదానంపై రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపెయిన్ చేయిస్తామని చెప్పారు. కంటి వైద్యులు డాక్టర్ పి.సుధాకర్రావు, డాక్టర్ రాఘవ ప్రీతమ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత ప్రచారం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ టీమ్చే డ్రగ్స్ వద్దు బ్రో క్యాంపెయిన్ను విస్తృతం చేస్తున్నామని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ చెప్పారు. ఆయన ఆదివారం ఓ హాస్పిటల్లో ఏర్పాటు చేసిన నేత్రదాన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్లో భాగంగా విద్యాసంస్థల వద్ద ఉన్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు లేకుండా చేసి ఇప్పటివరకు రూ.54 లక్షల జరిమానా విధించామన్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఔషధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ విక్రయించకుండా చేశామన్నారు. 13 మంది గంజాయి స్మగ్లర్ల ఆస్తులు సీజ్ చేశామని తెలిపారు. పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం ద్వారా 24 మందిని అరెస్ట్ చేసి జైలుకు పంపించామన్నారు. ప్రతి తల్లి తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలని, ఎక్కడైనా డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే 1972కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. గంజాయి నుంచి విముక్తి కల్పించేందుకు ఈగల్ హెడ్క్వార్టర్స్కు అనుసంధానంగా 48 డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.


చెరువు నీటిలో మునిగిన వరి పంటను చూపుతున్న రైతు నాగరాజు


నీట మునకతో పూర్తిగా దెబ్బతిన్న మొక్కజొన్న పంట

నీట మునిగిన పంట పొలాలు

సి.బెళగల్: బ్రాహ్మణదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు కొట్టాల గ్రామంలో పంట పొలాలు నీటమునిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు, పుల్లకూర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు వదలడంతో బ్రాహ్మణదొడ్డి చెరువు నిండిపోయింది. అధికారులు ఈ చెరువు నీటిని దిగువకు వదలకపోవడంతో ఎక్కువైన నీళ్లు పక్కనున్న పంటపొలాలను ముంచెత్తాయి. దీంతో దాదాపు 30 ఎకరాల్లో సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సాగుకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, నీటి ముంపుతో జరిగిన నష్టాన్ని ఎవరూ భరిస్తారని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే చెరువు నీటి ప్రవాహంతో గ్రామానికి రాకపోకలు సైతం నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


చెరువు కొట్టాల గ్రామం వెళ్లే దారిలో మోకాళ్లలోతు మేర నిలిచిన చెరువు నీరు